సాక్షి హనుమకొండ

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



కొనేముందు తెలుసుకోండి..!
బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేముందు పలు జాగ్రత్తలు పాటిస్తే అసలు బంగారం, దాని నాణ్యతను సులువుగా గుర్తించి మోసాలకు చెక్ పెట్టొచ్చని పలువురు అంటున్నారు. - 8లో▸



ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి
ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎం డీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $39^{0}/26^{0}$
జిల్లాలో ఉదయం ఎండ ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఉక్కపోత, వేడి ఉంటుంది. సాయంత్రం సమయంలో ఈదురుగాలలతోపాటు చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యోగా కౌన్సిలర్ల నియామక ఇంటర్వ్యూలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూర విద్య కేంద్రంలో డిప్లొమా ఇన్ యోగా కోర్సు బోధనకు బుధవారం కౌన్సిలర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దూర విద్యాకేంద్రం డైరెక్టర్ బి.సురేశ్‌లాల్, విద్యావిభాగం డీన్ ఎన్.రాంనాథ్‌కిషన్, బీఓఎస్, వరంగల్ నిట్ ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు. 9మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరితో ఈ రెండు బ్యాచ్‌లకు యోగా థియరీ, ప్రాక్టికల్స్ క్లాస్‌లు నిర్వహించాలని యోచిస్తునట్లు డైరెక్టర్ సురేశ్‌లాల్ తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలపై విస్తృత ప్రచారం

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల(మే) 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. బుధవారం హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ నేతృత్వంలో డీఎస్ఏ కోచ్‌లు పట్టణ పరిధి వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలను కలిసి శిక్షణ శిబిరాల వివరాలను వెల్లడిస్తూ విద్యార్థులను తరగతులకు పంపంచాలని కోరారు. 23 క్రీడాంశాల్లో శిక్షణ అందించనున్నట్లు, ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోషణ పక్షోత్సవాలు ప్రారంభం



కాజీపేట: కాజీపేటలోని బాపూజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షోత్సవాలను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జయంతి ప్రారంభించారు. సోమిడి సెక్టార్ అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో వివిధ రకాల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేయించారు. ఈసందర్భంగా బాలింతలు, గర్భిణులకు పోషక విలువ కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై పీడీ అవగాహన కల్పించారు. ప్రీస్కూల్ పిల్లలకు నీతి కథలు, సంభాషణలు వినిపించారు. సీడీపీఓ విశ్వజ, సూపర్‌వైజర్ కవిత, టీచర్లు రఘుకుమారి, శ్రీదేవి, వినోద, ఆయాలు పాల్గొన్నారు.

జెన్‌పాక్ట్ నియామకాల్లో 'పింగిళి' విద్యార్థుల సత్తా



హన్మకొండ అర్బన్: ప్రముఖ కార్పొరేట్ సంస్థ జెన్‌పాక్ట్‌లో వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు 17 మంది ఉద్యోగాలు సాధించి సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు బుధవారం కళాశాల ఆవరణలో నియామక పత్రాలు అందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రముఖ కార్పొరేట్ కంపెనీల్లో ఒకటైన జెన్‌పాక్ట్ ద్వారా 56 మంది బీకాం, బీబీఎం విద్యార్థులు 60 గంటల శిక్షణ పొందినట్లు, అందులో 17 మంది ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఉద్యోగాలు పొందడం కళాశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జెన్‌పాక్ట్ సంస్థ శిక్షణాధికారి మంజుల షిండే, కామర్స్ విభాగాధిపతి సారంగపాణి, జెన్‌పాక్ట్ సంస్థ ట్రైనర్లు సురేశ్, సయ్యద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్ అన్నారు. హనుమకొండలోని కేయూసీ సబ్ స్టేషన్‌లో 11 కేవీ కిషన్‌పుర, 11 కేవీ నయీంనగర్ ఫీడర్లపై అధిక భారం పడడంతో లోడ్ తగ్గించడానికి రూ.50 లక్షల వ్యయంతో 11 కేవీ సిక్‌వాడ ఫీడర్‌ను కొత్తగా నిర్మించారు. ఈ ఫీడర్‌ను బుధవారం కేయూసీ సబ్ స్టేషన్‌లో మధుసూదన్ ప్రారంభించారు. కార్యక్రమంలో హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.మధుసూదన్‌రావు, టౌన్ డీఈ జి.సాంబ రెడ్డి, ఏడీఈ కె.రాజు, ఏఈ సీహెచ్.నవీన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కమలాపూర్: నేలవాలిన వరి పంట



కోత దశలో..

కమలాపూర్: మండలంలో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులతో కోత దశలో ఉన్న మామిడి, సపోట, వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. శనిగరానికి చెందిన పలువురు రైతులు లక్ష్మీపూర్, వంగపల్లి శివారుల్లో సుమారు 50 ఎకరాల్లోని మామిడి తోటలు, మరో ఐదెకరాల్లోని సపోట తోటలు కౌలుకు తీసుకున్నారు. వాన కారణంగా నేలరాలడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఆత్మకూరు: మండలంలోని కటాక్షపూర్ శివారులో నేలరాలిన మామిడికాయలు



గాలివాన గందరగోళం



పరకాల: పరకాల వ్యవసాయ మార్కెట్‌లో కొట్టుకుపోయిన ధాన్యపు రాశులు



పరకాల: బట్టీలో తడిసిన ఇటుకలు

జిల్లాలో నేలమట్టమైన పంటలు
- కొట్టుకుపోయిన ఇళ్ల పైకప్పులు
- తడిసిన ధాన్యం: రైతుల దైన్యం

పరకాల: జిల్లాలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. చేతికొచ్చే దశలో ఉన్న వరి పైరు నేలవాలింది. గాలి దుమారానికి పలు గ్రామాల్లో ఇళ్లపైకప్పులు లేచిపోయాయి. పరకాల వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన వందల క్వింటాళ్ల ధాన్యం వర్షపు నీటికి కొట్టుకుపోయింది. రాశులుగా పోసిన మిర్చి తడిసి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరోవైపు తోటలకు నష్టం వాటిల్లింది. పరకాల శివారులోని ఇటుకబట్టీలు పూర్తిగా తడిచిపోయి పనికిరాకుండా మారాయి. గాలిదుమారానికి నష్టం జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా అధికారులు రాత్రి 10 నుంచి బుధవారం తెల్లవారుజాము 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేశారు. వర్షంతో నష్టపోయామని, పరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.

శాయంపేట మండలంలో..
శాయంపేట: మండలంలో మంగళవారం రాత్రి వడగళ్ల వాన కురిసింది. మైలారం, పెద్దకోడెపాక, కొప్పుల, పత్తిపాక, హుస్సేన్‌పల్లి, శాయంపేట, గట్లకానిపర్తి, తహరాపూర్, కొత్తగట్టు సింగారం గ్రామాల్లో వరి, మొక్కజొన్న, అరటి పంటలు నేలవాలాయి. బుధవారం ఏఈఓలు అర్చన, అన్వేశ్, రాకేశ్ వివిధ గ్రామాల్లోని ఈదురుగాలులతో నేలవాలిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. హార్టికల్చర్ అధికారి మధులిక అరటి తోటలను పరిశీలించారు. మండలంలో 245 మంది రైతుల వరి పంట 347 ఎకరాలు, 38మంది రైతుల 57 ఎకరాల మొక్కజొన్న, 15 మంది రైతుల 30 ఎకరాల అరటి తోటలు దెబ్బతిన్నాయని తెలిపారు. మైలారం గ్రామానికి చెందిన రైతు దూదిపాల బుచ్చిరెడ్డి గ్రామ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబోయగా.. గాలివానకు రెండు క్వింటాళ్ల ధాన్యం చెరువులోకి కొట్టుకుపోయింది. గాలివానకు పై కప్పు లేచిపోయిన ఇళ్లను ఆర్ఐ రమేశ్‌ఖన్నా పరిశీలించి నష్టం అంచనా వేశారు.



శాయంపేట: పత్తిపాకలో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈఓ అర్చన

ఆత్మకూరు మండలంలో..
ఆత్మకూరు: కటాక్షపూర్ శివారు సుమారు 40 ఎకరాల్లోని తోటల్లో మామిడికాయలు రాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికి వచ్చిన మామిడి కాయలు నేల పాలు కావడంతో రూ.లక్షల్లో నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు లక్ష్మి, మల్లయ్య, రాజు కోరారు. నీరుకుళ్లలో అర్షం కుమారస్వామికి చెందిన అన్నదాత ఎరువుల గోదాం రేకులు గాలికి ఎగిరిపోయి సుమారు రూ.10.50 లక్షలు విలువైన ఎరువుల బస్తాలు తడిశాయి. నీరుకుళ్ల శివారులో వంగేటి ప్రభాకర్‌కు చెందిన రెండెకరాల వరి నేల వాలింది.

- మరిన్ని ఫొటోలు 9లో▸



పులిగిల్లలో రోడ్డుపై పడిన హైమాస్ట్ లైట్

అస్తవ్యస్తం..

నడికూడ: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. వరికోల్, పులిగిల్ల, రాయపర్తి, నడికూడ, కౌకొండ, కంఠాత్మకూరులో ఈదురు గాలులకు ఇంటిపై కప్పు రేకులు కొట్టుకుపోయాయి. రాయపర్తిలో అల్లం శ్రీనుకు సంబంధించిన రేకులు పడి ఆయన కాలు విరిగింది. పులిగిల్లలో రోడ్డుపై హైమాస్ట్ లైట్ పడిపోయింది. కంఠాత్మకూరులో అంబాల–పరకాల రోడ్డుపై చెట్టు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



ఈదురు గాలులకు కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు రేకులు

కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి..

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి

ఎల్కతుర్తి: సన్న వడ్లకు ఈ సంవత్సరం కూడా 500లు బోనస్ ఇస్తున్నట్లు, రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ప్రారంభించారు. అలాగే మండలంలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సన్నం బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని, తెలంగాణలో ప్రతీ బిడ్డ సన్న బియ్యం అన్నం తింటున్నట్లు చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి 3500ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని.. ఇటీవలే భూభారతి కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. ఈనెల 28న భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముల్కనూరు ప్రాంత అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

తొలి యూనిట్ ఇక్కడే..
అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి కింద 60 శాతం రాయితీతో మొబైల్ ఫిష్ ఔట్‌లెట్ తొలి యూనిట్ వాహనాన్ని ఇక్కడే ప్రారంభించామన్నారు. ఈ యూనిట్ విజయవంతంగా కొనసాగితే జిల్లాలో మరిన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఫాక్స్, ఇతర సొసైటీల కంటే మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 151 ధాన్యం కొనుగోలు కేంద్రాలకుగాను 70కిపైగా మహిళా సంఘాల సొసైటీల ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిలో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనట్లు, మిగతావి త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ముందుగా ఎంపిక చేసిన పైలట్ గ్రామాల్లో రెండు వారాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేశ్‌రాథోడ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ వీరేశం, మండల అధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, ఉసకోయిల ప్రకాశ్, కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, చంద్రశేఖగుప్తా, అశోక్ ముఖర్జీ, డబ్బ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



భీమదేవరపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అర్హుల ఎంపికలో మార్గదర్శకాలు తప్పనిసరి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి
- అధికారులతో సమీక్ష

హన్మకొండ అర్బన్: ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ఎంపిక తీరుపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన వారి ఎంపికను ఇందిరమ్మ కమిటీతో కలిసి అధికారులు చేయాలన్నారు. మే 2వ తేదీన ఎంపిక చేసిన వారి జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలన్నారు. వేసవి నేపథ్యంలో.. జిల్లాలో ఎక్కడా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల చేతిపంపుల మరమ్మతులను చేయించాలన్నారు. అనంతరం మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు, ఆవాసాలకు తాగునీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధికారులు అడిగిన పలు సందేహాలకు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి రవీందర్ వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ మేన శ్రీను, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

కేయూ క్యాంపస్: గత వీసీ హయాంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నామని, రాబోయే నూతన కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేద్దామని కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు ఎల్.యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి అన్నారు. బుధవారం యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన ఆ సంఘం సంఘం సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు.

సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయండి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య
- ఎల్కతుర్తి జంక్షన్ పనుల పరిశీలన

ఎల్కతుర్తి: వరంగల్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైన ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరుగుతున్న జంక్షన్ సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనుల పురోగతి గురించి 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఇతర శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. జంక్షన్ నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జంక్షన్ నిర్మాణం, సుందరీకరణ పనులు 80 శాతం పూర్తయినట్లు తెలిపారు. మిగతా పనులు పది రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫౌంటెన్ నిర్మాణం, గ్రీనరీ ఏర్పాటు, శిల్పాలు, విద్యుత్ లైట్లు, సైన్ బోర్డులు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ పరిశీలించారు. క్యాంటీన్ ఏర్పాటు బాగుందని, విజయవంతగా క్యాంటీన్ నిర్వహించాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేశ్ రాథోడ్, ఆర్టీసీ డీఎం ధరమ్‌సింగ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఘన్‌పూర్‌కు కడియం చేసిందేమీ లేదు

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య

వేలేరు: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిందేమీ లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నిధులు కేటాయించి ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేశారని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం మండలంలోని షోడాషపల్లి గ్రామంలో వేలేరు, ధర్మసాగర్, చిల్పూరు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఘన్‌పూర్ నియోజకవర్గంలో 2004 నుంచి కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలవనేలేదని, ఎమ్మెల్యే కాకుండా అభివృద్ధి ఎలా చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు దేవాదులకు శంకుస్థాపన చేసి వదిలేస్తే పనులు వెంటనే చేపట్టాలని రాజయ్య పిండప్రదానం పెట్టి నిరసన తెలిపిన విషయం మర్చిపోయావా? అని ప్రశ్నించారు. ఆయనకు వయస్సు మళ్లడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. దేవునూరు గుట్టల్లో 21 ఎకరాల భూమిని కడియం శ్రీహరి తన బినామీల పేరుతో పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. అనంతరం వివిధ పార్టీల నుంచి సుమారు 200 మంది పల్లా సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో జనగామ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఆయా మండలాల ఇన్‌చార్జులు భూపతిరాజు, సోమిరెడ్డి, మనోజ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కవితా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మండల కోఆర్డినేటర్ గోవింద సురేశ్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ఛీటింగ్.. చిట్స్..!

ఉమ్మడి జిల్లాలో ప్రజల సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం



- కట్టిన డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్న సంస్థలు
- చిట్‌ఫండ్స్ బాధితులంతా కలిసి సంఘాల ఏర్పాటు
- మా చిట్టీ డబ్బులు మాకు ఇప్పించండని వేడుకోలు
- ఏం చేయలేమంటూ చేతులెత్తేస్తున్న యంత్రాంగం
- డబ్బులు లేవు ప్లాట్లు తీసుకోండంటూ నిర్వాహకుల బెదిరింపులు

కాజీపేట అర్బన్ : ప్రైవేట్ వ్యక్తుల వద్ద చిట్టీలు కడితే సొమ్ముకు భద్రత ఉండదని, రిజిస్టర్డ్ చిట్‌ఫండ్స్ కంపెనీల్లో చేరితే ప్రభుత్వమే రక్షణ కల్పిస్తుందని ఆశపడ్డ సామాన్య, మధ్య, తరగతి కుటుంబాలకు నిరాశే మిగిలింది. చిట్టీ గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకుండా నిర్వాహకులు తిప్పుకుంటున్నారు. గట్టిగా అడిగితే ప్లాట్ అయితే ఉంది.. తీసుకుంటే తీసుకో.. లేకపోతే లేదు అంటూ బెదిరిస్తున్నారు. దీంతో ఎటూ పాలుపోని ఖాతాదారులు బాధిత సంఘంగా ఏర్పడి అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఆయా చిట్‌ఫండ్ సంస్థల ఎదుట నిరసనలు తెలుపుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 8వేల మంది బాధితులు డబ్బుల కోసం తిరుగుతున్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో చిట్స్, టర్నోవర్ ఇలా..
ఉమ్మడి వరంగల్ జిల్లాలో రిజిస్టర్డ్ చిట్స్ 168 బ్రాంచ్‌లు ఉన్నాయి. ఇందులో 108 చిట్స్ కంపెనీల బ్రాంచీలు మాత్రమే నేటికీ లావాదేవీలను కొనసాగిస్తున్నాయి. 60 కంపెనీలు గతంలో తాము తీసుకున్న చిట్టీల లావాదేవీలు తప్ప కొత్తవి వేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి చిట్స్ కంపెనీలు రూ.340కోట్ల టర్నోవర్‌తో నడుస్తుంటాయి.

ఆస్తులు, డిపాజిట్లు సీజ్
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలనెలా వాయిదాలు కట్టి తిరిగి చెల్లింపులకు నోచుకోని బాధితులు చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. దీంతో పలు చిట్‌ఫండ్ సంస్థల ఆస్తులు, డిపాజిట్లను సీజ్ చేశారు. సీజ్‌చేసిన డిపాజిట్ల విలువ రూ.76కోట్లు కాగా, రూ.100 కోట్ల ఆస్తులు ఉన్నాయి. డబ్బుల కోసం వెళ్లిన ఖాతాదారులకు 'మా ఆస్తులు, డిపాజిట్లు సీజ్ చేశారు. మేం ఎలా చెల్లించాలో చెప్పండి' అంటూ నిర్వాహకులు ఎదురు ప్రశ్నించడంతోపాటు కొన్ని సందర్భాల్లో దాడులకు దిగుతున్నారు.

డబ్బులకు జవాబుదారీ ఎవరు?
రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీల ఏర్పాటు సమయంలో చిట్టీలకు తగ్గట్టుగా వందశాతం డిపాజిట్ రూపంలో జిల్లా చిట్స్ సహాయ రిజిస్ట్రార్ కార్యాలయంలో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మన సొమ్ము భద్రత ఉందని భావించి సామాన్య, మధ్య తరగతి ప్రజలు చిట్‌ఫండ్ కంపెనీల్లో చేరుతున్నారు. ఇప్పటికే పలు చిట్‌ఫండ్ కంపెనీలు డబ్బులు చెల్లించకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే మరోవైపు ఇటీవల కాలంలో తొమ్మిది చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేశాయి. ఆయా బాధితులు అధికారుల దగ్గరికి వెళ్తే.. తాము ఏమి చేసే పరిస్థితి లేదు. వారిని పిలిపించి మాట్లాడుతాం అని ఉచిత సలహాలు ఇస్తున్నారు.



ఓ చిట్స్ కార్యాలయం ఎదుట డప్పు వాయిస్తూ నిరసన తెలుపుతున్న బాధితులు (ఫైల్)

చిట్టీ డబ్బులు డిపాజిట్లుగా...
తొండ ముదిరి ఊసరవెల్లిగా మారినట్లు చిట్‌ఫండ్ కంపెనీలు ముదిరి రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి. కొందరు తమ చిట్‌ఫండ్ కంపెనీలో చేరిన ఖాతాదారుడికి సకాలంలో డబ్బులు చెల్లించకుండా 'మీ డబ్బులు మా వద్ద భద్రంగా ఉంటాయి. నెలనెలా వడ్డీ ఇస్తాం'. అంటూ డిపాజిట్లు చేయించుకున్నారు. అదే సమయంలో ఖాతాదారుడికి అవసరముండి డిపాజిట్ డబ్బులు చెల్లించండి అంటే డబ్బులు లేవు తాము చేసిన వెంచర్‌లో ప్లాట్ తీసుకో.. లేదంటే దిక్కున్న చోట చెప్పుకోమంటూ బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బాధితులు కలిసి బాధిత సంఘాలను ఏర్పాటు చేసుకుని చిట్స్ కార్యాలయాల ఎదుట డప్పు వాయిస్తూ నిరసన తెలుపుతున్నారు.

బిడ్డ పెళ్లి కోసం దాచుకున్నా..
మా బిడ్డ పెళ్లి కోసమని వరంగల్‌లోని శుభధరణి చిట్‌ఫండ్ కంపెనీలో రూ.5లక్షల చిట్టీలో చేరా. రెండు సంవత్సరాల క్రితం చిట్టీ ముగిసింది. నాకు రూ.3.20లక్షలు రావాలి. నాటినుంచి నేటి వరకు తిరుగుతూనే ఉన్నా. రెండు చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కానీ అకౌంట్‌లో డబ్బులు లేవు. ఎప్పుడిస్తారో చెప్పడం లేదు.
- సబిత, వరంగల్, బాధితురాలు

ప్లాట్ తీసుకోమంటూ ఒత్తిడి చేస్తున్నారు..



నేను అక్షర చిట్స్‌లో రూ.3లక్షల చిట్టీలు రెండింటిలో చేరా. చిట్టీ ముగిసేంత వరకు ప్రతినెలా కిస్తీలు చెల్లించా. చిట్టీ ముగిసి రెండేళ్ల గడుస్తున్నా నాకు రావాల్సిన రూ.6లక్షలు ఇవ్వడం లేదు. హనుమకొండలోని చిట్స్ కార్యాలయానికి వెళ్తే యజమాని అందుబాటులోకి రావడం లేదు. మధ్యవర్తులు వచ్చి నీకు చిట్టీ డబ్బులు కాదు.. జనగామలోని మా వెంచర్‌లో ప్లాట్ తీసుకోమంటూ ఒత్తిడి చేస్తున్నారు.
- నల్ల రవీందర్, బాధితుడు

చిట్స్ సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు
చిట్‌ఫండ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ఐజీ, ఏఐజీ, డీఐజీలతోపాటు జిల్లా రిజిస్ట్రార్‌తో కూడిన ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. త్వరలో చిట్స్ బాధితుల సమస్యల పరిష్కారానికి కమిటీ నిర్ణయం తీసుకుంటుంది.
- ఫణీందర్, జిల్లా రిజిస్ట్రార్

క్లుప్తంగా

రూ. 5.60 లక్షల విలువైన ఎండు గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సంపత్‌రావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లి అర్బన్: గణపురం మండలం రవినగర్ సమీపంలో రూ. 5.60లక్షల విలువైన 11 కేజీల ఎండు గంజాయి పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం భూపాలపల్లి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి మండలం గుర్రంపేటకు చెందిన ఆరెల్లి అఖిల్, గణపురం మండలం చెల్పూరుకు చెందిన ఆముదాల కార్తీక్, హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోల్‌కు చెందిన ముస్కే రోహిత్ స్నేహితులు. తాము సంపాదించే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో కొద్ది రోజులుగా ఒడిశాలోని కొండప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి భూపాలపల్లి, గణపురం మండలాల పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 15న రవినగర్ సమీపంలో గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు అశోక్ తన సిబ్బందితో కలిసి మంగలోనికుంట మత్తడి వద్ద మాటు వేయగా ముగ్గురు వ్యక్తులు సంచులు పట్టుకుని అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి రవాణా చేస్తున్నట్లు అంగీకరించడంతో సరుకు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. కాగా, గంజాయిని పట్టుకోవడంలో ఉత్తమ విధులు నిర్వర్తించిన చిట్యాల సీఐ మల్లేశ్, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్, సీసీఎస్ ఎస్సై భాస్కర్‌రావు, సిబ్బందిని అభినందించారు.

వడదెబ్బతో మహిళ మృతి



వసంత(ఫైల్)

నర్సంపేట రూరల్ : వడదెబ్బతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన నర్సంపేట మండలంలోని రాజుపేట శివారు గార్లగడ్డతండాలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ఫాల్తియా వసంత (35) మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి పజ్జూర్న చేనులో పని చేసి సాయంత్రం ఇంటికి వచ్చింది. అదేరోజు రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. మృతురాలికి భర్త భద్రు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైలునుంచి జారి పడి యువకుడి మృతి

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ వద్ద ఓ యువకుడు రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని ఏసీరెడ్డి నగర్‌కు చెందిన పెరుమాండ్ల అనిల్ (29) మంగళవారం రామగుండంలో కూలి పనికి వెళ్లి తిరిగి రైలులో సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో రైలు వరంగల్ రైల్వే గేట్ సమీపాన చేరుకోగానే అనిల్ అందులోనుంచి జారిపడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆటోలో ఎంజీఎం తరలించగా.. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు శవపంచనామ నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు.

కొనేముందు తెలుసుకోండి..!



సాక్షి మీ కోసం

పసిడి నాణ్యతను గుర్తించండిలా..

- హాల్‌మార్క్‌తోనే మోసాలకు చెక్
- యూనిక్ ఐడీ నంబర్‌ను బట్టి స్వచ్ఛత
- నాణ్యత శాతం సర్టిఫికెట్‌తోనే అసలు గుర్తింపు

ఖిలా వరంగల్: బంగారం ఆభరణాలంటే ఇష్టపడని వారుండరు. ముఖ్యంగా మహిళలు మక్కువ చూపుతారు. హుందాకు చిహ్నంగా భావిస్తారు. అందుకే పెళ్లిళ్లు, శుభకార్యాలయాల్లో బంగార ఆభరణాలదే అగ్రస్థానం. ధర ఎంత పెరిగినా.. పసిడిని కొనుగోలు చేయడం మానరు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం సంప్రదాయ అవసరాలు తీర్చడమే కాకుండా పెట్టుబడులకు కూడా ఉపయోగపడుతోంది. అందుకే చాలా మంది భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా బంగారం విక్రయాలు పెరుగుతున్నాయి. అదే స్థాయిలో షాపులు కూడా పెరుగుతున్నాయి. భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, ఏటూరునాగరం, నర్సంపేట, పరకాల, తొర్రూరు, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యల్లో బంగారు ఆభరణాల షాపులు ఉన్నాయి. కొనుగోలు సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే అసలు బంగారం, దాని నాణ్యతను సులువుగా గుర్తించి మోసాలకు చెక్ పెట్టొచ్చు. వరంగల్ ట్రైసిటీలో చిన్న, పెద్ద కలిపి సుమారు 150పైగా దుకాణాలు ఉన్నాయి. అనధికారికంగా మరికొన్ని వెలుస్తున్నాయి. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ.95 వేలకుపైగా చేరింది. ఈ క్రమంలో కొనుగోలు సమయంలో వినియోగదారులు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

బంగారంలోనే రంగులు

బంగారు ఆభరణం తయారీలో నికిల్, మాంగనీస్ లేదా పల్లాడియం వంటి లోహాలు కలుపుతారు. అప్పుడు అది బంగారం వర్ణంలోనే కొంచెం తెల్లని ఛాయలో ఉంటుంది. రాగి ఎక్కువ కలిపితే ఎరుపు, గులాబీ ఛాయలో కనిపిస్తుంది. రోజ్‌గోల్డ్ అయితే అందులో 25 శాతం రాగి కలిపినట్లు అర్థం చేసుకోవచ్చు. అప్పుడు ఆ బంగారంతో 18 క్యారెట్లు మాత్రమే ఉంటుంది. వెండి, మాంగనీస్, రాగిని ఉపయోగిస్తే బూడిద రంగు ఛాయలో ఉంటుంది. కేవలం వెండిని మాత్రమే కలిపితే గ్రీనిస్ షేడ్‌లో కనిపిస్తుంది.

స్వచ్ఛత గుర్తింపు ఇలా..

ఆభరణం అంచులు రంగు పోయి బంగారపు వర్ణం కాకుండా ఇతర వర్ణం కనిపిస్తుంటే అది కచ్చితంగా పూత పోసిన ఆభరణమని గ్రహించాలి. నోటి పళ్ల మధ్య పెట్టి బలంతో ఆభరణాన్ని నొక్కి చూడండి. స్వచ్ఛ బంగారమా.. పూత పోసిందా అని తెలుసుకోవచ్చు. పంటి గాట్లను గమనించి బంగారం నాణ్యతను సులభంగా తెలుసుకోవచ్చు. బంగారంలో ఇనుము కలిసి ఉంటే ఆయస్కాంతంతో గుర్తించొచ్చు. షైనింగ్ లేని సిరామిక్ ప్లేట్ మీద బంగారు ఆభరణాన్ని రుద్దితే నల్లని చారలు పడితే ఆది స్వచ్ఛమైనది కాదు. బంగారు గీతలు పడితే స్వచ్ఛమైనది అని అర్థం. ఆభరణం కొనుగోలుకు ముందే షాపు వద్ద నైట్రిక్ యాసిడ్‌తో టెస్ట్ చేయమని కోరవచ్చు. ఆభరణంపై చుక్క నైట్రిక్ యాసిడ్ వేసిన వెంటనే రసాయనిక చర్య ప్రారంభమై ఆకుపచ్చ రంగులో కనిపిస్తే బేస్ మెటల్ లేదా బంగారు పూత వేసిందిగా గ్రహించాలి. బంగారం వర్ణంలోనే రియాక్షన్ కనిపిస్తే బంగారం పూత వేసి ఇత్తడిగా గమనించాలి. పాల రంగులో కనిపిస్తే వెండి ఆభరణంగా ఎలాంటి రియాక్షన్ లేకపోతే దానిని స్వచ్ఛమైన ఆభరణంగా గుర్తించాలి.



24 క్యారెట్లు అంటే..

బంగారం స్వచ్ఛతను క్యారెట్ల రూపంలో కొలుస్తారు. 99.9 శాతం స్వచ్ఛత ఉన్న బంగారాన్ని 24 క్యారెట్ల బంగారం అంటారు. దీనితో ఆభరణాలు చేయరు. ఇది బిస్కెట్ రూపంలోనే ఉంటుంది. ఆభరణాలు గట్టిగా , మన్నికగా ఉండేందుకు గాను స్వచ్ఛమైన బంగారానికి రాగి, వెండి, కాడ్మియం, జింక్ వంటి ఇతర లోహాలు కలుపుతారు. ఇలా చేయడం ద్వారా బంగారం స్వచ్ఛత 22.18.14 క్యారెట్లుగా నిర్ధారిస్తారు.

క్యారెట్ల బట్టి స్వచ్ఛత..

- 24 క్యారెట్లు: 99.9 శాతం స్వచ్ఛత ఇది. బిస్కెట్ రూపంలో ఉంటుంది.
- 22 క్యారెట్లు: 91.6 శాతం బంగారం, మిగతా 8.4 శాతం ఇతర లోహాలు కలుస్తాయి.
- 18 క్యారెట్లు: 75 శాతం బంగారం, మిగతా 25శాతం ఇతర లోహాలు
- 14 క్యారెట్లు: 58.5 శాతం బంగారం, మిగతా భాగం ఇతర లోహాలు
- 12 క్యారెట్లు: 50శాతం మాత్రమే బంగారం, మిగతా 50శాతం ఇతర లోహాలు మిశ్రమంతో తయారీ అవుతుంది.
- 10 క్యారెట్లు: 41.7 శాతం బంగారం మాత్రమే ఉంటుంది.

కేడీఎం అంటే..

జ్యూవెల్లరీ దుకాణంలో బంగారం కొనే సమయంలో ఆ ఆభరణం కేడీఎం అని షాపు యజమానులు చెబుతారు. అసలు కేడీఎం అంటే బంగారు ఆభరణాలు తయారీలో కాడ్మియంతో సోల్డరింగ్ చేస్తారు. ఇవి 91.6 స్వచ్ఛతతో ఉంటాయి.

ఇవి గమనించాలి..

24 క్యారెట్ల బంగారంలో 99.9, 22 క్యారెట్ బంగారంలో 91.6 శాతం స్వచ్ఛత ఉంటుంది. స్వచ్ఛ బంగారం మొత్తగా ఉంటుంది. బంగారంలో కలిపిన ఇతర లోహాల శాతాన్ని బట్టి ఆభరణాల రంగు, గట్టిదనం, మన్నిక ఆధారపడి ఉంటాయి. నాణ్యత తెలిపే కొలమానం వేయించుకుని రశీదులు తీసుకోవాలి. భవిష్యత్‌లో తేడా వస్తే కేసు వేయడానికి అవకాశం ఉంటుంది.

హాల్‌మార్క్ సర్టిఫికెట్‌తో కొనుగోలు చేయాలి




బంగారు ఆభరణాల కొనుగోలులో వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి. భారీగా పెరుగుతున్న బంగారం ధరలు వ్యాపారులకు వరంగా, వినియోగదారులకు భారంగా మారాయి. రెడీమేడ్ బంగారం, వెండి ఆభరణాల్లో 60 నుంచి 70శాతం నష్టాన్ని కలిగిస్తాయి. నాణ్యతాప్రమాణాల గుర్తింపు కోసం హాల్‌మార్క్ ముద్ర, నాణ్యత శాతాన్ని సూచించే నంబర్‌తో కూడిన వస్తువునే కొనుగోలు చేయాలి. వస్తువు నాణ్యత లేనిపక్షంలో బీఐఎస్‌కు ఆన్‌లైన్‌లో లేదా వినియోగదారుల సంఘాల ప్రతినిధికి ఫిర్యాదు చేయాలి

-మొగిలిచెర్ల సుదర్శన్, రాష్ట్ర అధ్యక్షుడు, సీసీఐ

హాల్‌మార్క్ సర్టిఫికెట్‌తో పసిడి నాణ్యత..

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్ హాల్‌మార్క్ సర్టిఫికేషన్ విధానం ప్రవేశ పెట్టింది. తయారైన ఆభరణం చిన్నదైనా,పెద్దదైనా హాల్‌మార్క్ ముద్ర, నాణ్యత శాతాన్ని సూచించే నంబర్‌తో పాటు ఆ వస్తువు సర్టిఫై చేసిన హాల్‌మార్క్ సెంటర్ వివరాలు తెలిపే హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ యూనిక్ ఐడీ నంబర్ విధిగా ఉండాలి. ఈ అన్ని వివరాలను కొనుగోలు రశీదులో పొందుపర్చి వినియోగదారుడికి అందించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు ఇవేవి చేయకపోగా అన్ని ఆభరణాలు 91.6 అని విక్రయిస్తున్నారు. దీనికి రశీదులు ఇవ్వకుండా.. ఇచ్చినా అందులో వివరాలు తెలుపడం లేదు. దీనిపై వినియోగదారులు చైతన్యవంతులై నిలదీయాలి.



నెల రోజుల్లో 'కిటెక్స్' ప్రారంభం

- కంపెనీ మేనేజర్ మనోజ్
- పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యేకు వివరించిన మేనేజర్



కిటెక్స్ కంపెనీ మేనేజర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లోని కేరళ కేంద్రంగా ఉన్న 'కిటెక్స్' కంపెనీని నెల రోజుల్లో ప్రారంభిస్తామని మేనేజర్ మనోజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ సత్యశారద, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కంపెనీ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ మనోజ్.. కలెక్టర్, ఎమ్మెల్యేకు కంపెనీలో తయారు చేసే గార్మెంట్లు, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరుగుతోందని, వచ్చే నెలలో ప్రధాని మోదీతో కంపెనీని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, కంపెనీలో ఇప్పటికే పలు కేటగిరీలకు చెందిన ఉద్యోగుల భర్తీ ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో కొనసాగుతోంది. కంపెనీ ఇప్పటికే 25,000 ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ప్రతి రోజూ నిరుద్యోగులు కంపెనీ వద్దకు దరఖాస్తులతో క్యూ కడుతున్నారు. టీజీ ఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి, గీసుకొండ తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

20న హజ్ యాత్రికులకు శిక్షణ

న్యూశాయంపేట : పవిత్ర మక్కాలోని హజ్‌యాత్రకు వెళ్లే ఉమ్మడి వరంగల్ జిల్లా యాత్రికులకు ఈనెల 20 ఆదివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు సర్వర్‌మోహియోద్దీన్ ఘాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని ఏ1 ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. యాత్రికులకు ప్రొజెక్టర్ ద్వారా సవివరంగా యాత్ర ఎలా చేయాలనే విషయాలపై శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. యాత్రీకులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఒక్కడే..18 బైక్‌లు చోరీ

- రద్దీ ప్రాంతాలే లక్ష్యం..
- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ తిరుమల్

హసన్‌పర్తి: ఒకే యువకుడు వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన 18 బైక్‌లు చోరీ చేశాడు. వాహనాల తనిఖీల్లో తప్పించుకునే క్రమంలో పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకుని తీసుకుని విచారించగా ఈ విషయం బయటపడింది. ఇందుకు సంబంధించిన వివరాలను కాజీపేట ఏసీపీ తిరుమల్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం ఫతేపూర్‌కు చెందిన గుగులోత్ చందూలాల్ కొంతకాలంగా 56వ డివిజన్ గోపాలపురంలో ఉంటున్నాడు. తన స్నేహితుడి ఐడీతో జొమాటో, స్విగ్గి, ర్యాపిడో సంస్థల్లో పనిచేస్తున్నాడు.అయితే ఆ ఆదాయం సరిపడకపోవడంతో సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనకు వచ్చి రద్దీ ప్రాంతాల్లో పార్క్ చేసిన వాహనాలను మాయం చేస్తున్నాడు. ఇందులో భాగంగా హనుమకొండ పీఎస్ పరిధిలో ఏడు, హసన్‌పర్తి పీఎస్ పరిధిలో మూడు, కేయూసీ పీఎస్ పరిధిలో ఒకటి, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పరిధిలో నాలుగు, భువనగిరిలో రెండు, హైదరాబాద్‌లో ఒకటిచొప్పున ఎత్తుకెళ్లాడు.

ఇంటిలోనే చోరీ వాహనాలు..

హసన్‌పర్తి మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసిన చందూలాల్ తప్పించుకునే క్రమంలో పట్టుకుని విచారించారు. చోరీ వాహనాలను ఫతేపూర్‌లోని తన ఇంటిలోనే భద్రపరిచినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో అతడి ఇంటికెళ్లి 18 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తిరుమల్ చెప్పారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఏసీపీ తిరుమల్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై దేవేందర్, సిబ్బందిని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

దిగుమతి సుంకాలు తగ్గిస్తే పత్తి రైతులకు నష్టాలు



పత్తిపై జరిగిన వీసీలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

వరంగల్: ది సదరన్ ఇండియా మిల్స్ అసోసియేషన్ కోరినట్లు దిగుమతి సుంకాలను 11శాతం కంటే ఎక్కువ మినహాయింపు కేంద్ర ప్రభుత్వం ఇస్తే దేశంలోని పత్తి రైతులు నష్టపోతారని తెలంగాణ కాటన్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ అధ్వర్యంలో కేంద్ర కమిషనర్ ఆఫ్ టెక్స్‌టైల్స్ రూప్ రాశి.. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల టెక్స్‌టైల్స్ సెక్రటరీలు, ఫైనాన్స్ సెక్రటరీలు, సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా, దేశంలో టెక్స్‌టైల్స్, స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషనల తోపాటు తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీ దిగుమతి చేసుకుంటున్న దూదిబేళ్లపై దిగుమతి సుంకాలను కేంద్ర ప్రభుత్వం మినహాయింపు(తగ్గిస్తే) ఇస్తే దేశంలోకి ఇతర దేశాలనుంచి దూదిబేళ్ల దిగుమతులు ఎక్కువై సాగు చేసే రైతుల ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.

విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ : ఈదురుగాలులు, భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో 16 సర్కిళ్ల పరిధిలో ప్రతీ అధికారి, ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. బుధవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఈదురుగాలులకు చెట్లు విరిగి లైన్లు తెగిపడి ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్ జరిగిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తమ సర్కిల్ పరిధిలోని సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు చేరవేయాలని, అక్కడి నుంచి కార్పొరేట్ ఆఫీస్‌కు సమాచారం అందించాలన్నారు. కావాల్సిన మెటీరియల్ అందుబాటలో ఉంచామని, ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఎక్కువ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, జగిత్యాల, పెద్దపల్లి ప్రాంతాల్లో ఎక్కువ ఈదురుగాలులు, భారీ వర్షాలు పడుతాయని, ఎస్ఈలు ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తూ, మెన్, మెటీరియల్‌తో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, సీఈలు రాజుచౌహాన్, అశోక్, 16 సర్కిళ్ల ఎస్ఈలు పాల్గొన్నారు.

టెంట్‌సిటీ నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

- కలెక్టర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం



వీఐపీ ఘాట్ వద్ద విగ్రహాలు తొలగిస్తున్న అధికారులు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతీనది పుష్కరాల్లో టూరిజంశాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన టెంట్‌సిటీ పనులు యుద్ధప్రాతిపాదికన చేట్టాలని మంత్రి శ్రీధర్‌బాబు.. భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మను ఆదేశించినట్లు తెలిసింది. బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో జరిగిన సరస్వతీ పుష్కరాల యాప్, వెబ్‌పోర్టల్ ప్రారంభ సమీక్షలో కలెక్టర్‌తో మంత్రి మాట్లాడినట్లు తెలిసింది. కాళేశ్వరంలోని వీఐపీ(సరస్వతి) ఘాట్ వద్ద తాత్కాలిక టెంట్‌సిటీ నిర్మాణాలకు రూ.83లక్షలు కేటాయించిన విషయం తెలిసిందే. కాగా, ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. మేఘా, సింగరేణి, ఎన్‌టీపీసీల్లో ఏదో ఒక్క సంస్థకు అప్పగించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు సమాచారం. టెంట్‌సిటీ కోసం ఇప్పటికే కాళేశ్వరంలో దేవస్థానానికి సంబంధించిన గుడిమాన్యం భూమిలో ఆరు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రైతులకు కూడా పంటనష్టం అందజేశారు. కానీ నిర్మాణాలు మొదలు కాకపోవడంతో మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రెండు రోజుల్లో షార్ట్‌టెండర్స్ పిలిచి పనులు చేసేలా ప్లాన్ చేస్తున్నట్లు ఆలయ వర్గాల సమాచారం.

వీఐపీ ఘాట్ వద్ద విగ్రహాల తొలగింపు

కాళేశ్వరంలోని వీఐపీ(సరస్వతి)ఘాట్ వద్ద పుష్కఘాట్ విస్తరణలో భాగంగా వేప, జమ్మి చెట్లు కలిసి ఉన్న చెట్టు కింద భక్తులు ఏర్పాటు చేసిన పలు దేవతా విగ్రహాలకు బుధవారం ఉద్వాసన పూజ చేసి తొలగించారు. కాగా, ఇటీవల కలెక్టర్ రాహుల్‌శర్మ సరస్వతీనది పుష్కరాల అభివృద్ధి పనులు పరిశీలించిన సమయంలో ఘాట్‌పై ఉన్న వేప, జమ్మి చెట్లు కలిసి ఉన్న చెట్టును తొలగించొద్దని, దేవతా విగ్రహాలను తొలగించి ప్రత్యేకంగా మళ్లీ ఓ చోట ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. దీంతో తొలగింపు పనులు చేపట్టారు.

పీఆర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- వరంగల్ జెడ్పీ సీఈఓ రాంరెడ్డి



ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న వరంగల్ జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

వరంగల్: జిల్లాలోని పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వరంగల్ జెడ్పీ సీఈఓ రాంరెడ్డి తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై బుధవారం సీఈఓ రాంరెడ్డి ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పీఆర్‌లోని ఆఫీస్ సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించకుండా.. ఇతర శాఖల నుంచి వచ్చిన వారి కోసం ఖాళీగా పెట్టినట్లు విమర్శలు వస్తున్నట్లు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. రికార్డు అసిస్టెంట్ల పదోన్నతులతోపాటు కారుణ్య నియామకాలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేస్తామని సీఈఓ హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు యుగేందర్, విజయపాల్‌రెడ్డి, రవికుమార్, రాజ్‌కుమార్, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

కక్కిరాలపల్లిలో వ్యక్తి ఆత్మహత్య



చందర్(ఫైల్)

ఐనవోలు: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కక్కిరాలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కత్తెరశాల చందర్ (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో రెండో భార్య శ్వేతతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీనిపై మనస్తాపానికి గురైన చందర్ బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, చందర్‌కు మొదట మమతతో వివాహం జరగగా ఇద్దరు కుమారులు రాజేశ్, రోహిత్ జన్మించారు. చందర్‌తో మొదటి భార్య, కుమారులు వేరుగా ఉండడంతో సుమారు 10 సంవత్సరాల క్రితమే శ్వేతను రెండో వివాహం చేసుకున్నాడు. చందర్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

వేసవిలో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను



డ్రైవర్లకు వాటర్ క్యాన్, రుమాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఆర్ఎం విజయభాను

హన్మకొండ: వేసవి కాలంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ డ్రైవర్లు విధులు నిర్వర్తించాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను అన్నారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని ఆర్టీసీ హనుమకొండ డిపోలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లకు వాటర్ క్యాన్లు, రుమాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ డ్రైవర్లు ఎండతోపాటు ఇంజన్ వేడి తట్టుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఇలాంటి తరుణంలో తగినంత తాగు నీరు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఎండ నుంచి ఉపశమనానికి రుమాలు చుట్టుకోవాలన్నారు. డ్యూటీలో అస్వస్థతకు గురవుతున్నట్లు కనిపించినా, డీ హైడ్రేషన్‌కు గురైనా వెంటనే ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడగాలులు, ఎండ వేడి నుంచి కొంతైనా ఉపశమనం పొందొచ్చన్నారు. ఈ క్రమంలోనే హనుమకొండ డిపోలోని ప్రతీ డ్రైవర్‌కు జ్యూట్ బ్యాగుతో కూడిన 5 లీటర్ల వాటర్ క్యాన్, రుమాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినట్లు వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హనుమకొండ డిపో మేనేజర్ బి.ధరమ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కేశరాజు భానుకిరణ్, మహేశ్, హనుమకొండ డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియాసుల్తానా, మెకానిక్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మోసగించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితరులు

ఎల్కతుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను నమ్మించి మోసం చేయడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామ సమీపంలో సుమారు 1,200 ఎకరాల్లో ఈనెల 27న నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్స సభ ఏర్పాట్లను ఆమె మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్, నాయకులు నాగుర్ల వెంకన్న, భరత్‌కుమార్, రాకేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యవతి రాథోడ్ మాట్లాడారు. తప్పుడు ప్రచారం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చితకిల పడిపోయిందన్నారు. నాడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని చెప్పారు. సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సదానంద, పార్టీ మండల అధ్యక్షులు మహేందర్, మండల సురేందర్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, తంగెడ మహేందర్, గోల్లె మహేందర్, మాజీ సర్పంచ్‌లు కుర్ర సాంబమూర్తి, దుగ్యాని సమ్మయ్య, జూపాక జడ్సన్ తదితరులు పాల్గొన్నారు.